# దృశ్యకల్పితమైన జగత్తునకు పరోక్షమైన దివ్యత్వము ఆధారము

**వేదవేదాంగములు వల్లెవేసియున్న**
**గద్యపద్యంబులను కూర్పగల్గియున్న**
**చిత్తశుద్ధియు లేకున్న చెడును వాడు**
**సత్యమును తెల్పు బాట శ్రీ సాయిమాట.**

ప్రేమస్వరూపులారా!

వేదము ద్వైతమని, వేదాంతము అద్వైతమని అనేక విధములైన ఆదర్శములచేత, ఆధారములచేత, శంకరులవారు ప్రచారప్రబోధలు సలుపుతూ వచ్చారు. వేదవేదాంతములకున్న వ్యత్యాసములు మానవశరీరమునకు, శరీరములోని అంగములకు ఉండిన వ్యత్యాసమువంటివే! కన్నులు, చెవులు, ముక్కు, నోరు, చేతులు, కాళ్లు, యివన్నీ దేహమునకు అంగములు. దేహములు సమాజమునకు అంగములు, సమాజము మానవతకు అంగము. ఈ మానవత్వము ప్రకృతికి అంగము. ప్రకృతి, పరమాత్మ అంగము. కనుక అంగాంగముల వ్యత్యాసము లోతుకు దిగి విచారించినప్పుడు అన్నీ ఒక్కటిగానే కనబడతాయి. కాశీలో ఒక పండిత సమావేశములో అనేక సమస్యలు ప్రారంభమై చివరకు అది అనేక వాదోపవాదములకు కారణమైంది. ఆ సమయంలో చిరునవ్వులు నవ్వుతూ శంకరులవారు 'ఈ వాదనవల్ల కేవలము వైరము అభివృద్ధి అవుతుందిగానీ, శాంతి చేకూరదు జగత్తునకు. కనుక, వాదము అనే పదము దీనికి సరైన పదము కాదు. సమస్యలు పరిహారము చేసుకోటమే మానవుని ప్రధాన సమస్య' అని బోధపరిచారు.

### సమస్త చింతలకు ప్రేమయే పరిహారము

జీవితమంతయు సమస్యల తోరణముగానే రూపొందుతుంది. మానవ జీవితములో

srisathyasaivachanamrutam

చింతలేని సమయమే కనిపించదు.

**పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత**
**సంసార మొకచింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్థక్య మొకచింత**
**జీవించు టొకచింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టంబు లొకచింత**
**సంతస మొకచింత వింత చింత**
**సర్వచింతల బాపెడు సాయి భక్తి**
**గొనుడు యికనైన జనులార కోర్కెమీర**
**ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

సమస్త చింతలకు ప్రేమయే పరిహారము. ప్రేమ ఉన్నచోట ద్వేషముండదు. ప్రేమ ఉన్నచోట వ్యత్యాసము కనిపించదు. ప్రేమ ఉన్నచోట అసూయ రాదు. ప్రేమ సర్వ సమన్వయము గావించే శక్తివంతమైనది. కానీ, వేదమునందు యిట్టి ప్రేమ గురించి ఎక్కువగా ప్రస్తావన కనబడదు. లోకములో అనేకమంది వేదపండితులుంటున్నారు. వేదమును వల్లె వేస్తున్నారు. తెల్లవారి మొదలు రాత్రి పరుండునంతవరకు వేదమును ఉచ్చరిస్తున్నారు. కాని, వారి వేదపఠనము కేవలము ఉచ్చరించుటవరకే పరిమితమైనదిగాని, ఆచరణ తక్కువ. కనుక, యిది ద్వైతమని చెబుతూవచ్చారు శంకరులవారు. 'సుఖంచమే... అంతాచమే'. కావాలి కావాలి అని ఆశపడటం. కావాలి అనే వాంఛ ద్వైతమునకు మూలకారణము. ఏదో ఒకటి ప్రత్యేకముగా ఉండటంచేత కదా అది నాకు కావాలి అని ఆశించటము. ఇక్కడ ఆశించే వ్యక్తి, ఆశింపబడే వస్తువు రెండూ వేరుగా ఉంటున్నాయి. కనుక ఆశ, ఆశించేవాడు రెండింటి ఏకత్వమే నిజమైన అద్వైతము. ఆశించేవాడు ఆశించే పదార్థముకంటె భిన్నముగా ఉండినప్పుడు ద్వైతము ఏర్పడుతుంది. ఇది ఒక కర్చీఫ్. ఈ కర్చీఫ్ నాకు కావాలి. ఈ కర్చీఫ్ అని ప్రత్యేకంగా ఉండటంవలన కదా నేను ప్రత్యేకంగా

sri sathyasaivachanamrutam

ఆశిస్తున్నాను. 'ఈ కర్చీఫ్ వేరు, నేను వేరు' అనుకుంటున్నాను. ఇది ద్వైతముగా రూపొందుతుంది. యిదే కర్చీఫ్‌లోపల అద్వైతమును మనం చక్కగా నిరూపించవచ్చు. ఇది ఏమిటి ఇది ఒక కర్చీఫ్. యిది ఒక బట్ట. కానీ దీనినే విచారణ చేసినప్పుడు, ఇది వస్త్రముకాదు. దారములయొక్క చేరిక. ఇది దారములుకాదు, ఇది ప్రత్తి. ప్రత్తి, దారము, బట్ట మూడు ఒక్కటే! కనుకనే 'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రియాయుధమ్ త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్'. అదే అద్వైతం. ఇక్కడ రెండు విభాగములు మనం విచారించాలి. ప్రత్యక్షం, పరోక్షం.

**అద్వైతములోని ఆనందము బయటకు వెలిబుచ్చటానికి వీలులేనిది**

ప్రత్యక్షముగా అనుభవించినది కొందరు దానియొక్క విషయము ప్రత్యేకించి చెప్పలేకపోతారు. ఒక మూగవాడు షడ్రసోపేత పదార్థములంతా భుజించాడు. కానీ ఒక్కొక్కదానిని ఏ విధంగా ఉన్నది వర్ణించి, విడమరిచి చెప్పడానికి వీలులేదు. చెప్పలేడుకూడా. అద్వైతములోని ఆనందము బయటకు వెలిబుచ్చటానికి వీలులేనిది. అనుభూతిలో నీకు అర్థమవుతుందిగానీ దాన్ని వివరించి ఇతరులకు చెప్పటము వీలుకాదు. ఇక్కడ పరోక్షమే లేకుండిన ప్రత్యక్షము శూన్యము. దురదృష్టవశాత్తు ఈనాడు ప్రత్యక్షమునకే ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నారుగానీ పరోక్షమునకు ఏమాత్రము అవకాశము అందించటములేదు. పరోక్షమును విశ్వసించటంలేదు. యింకొక చిన్న ఉదాహరణ. ఒక ఐస్ క్యూబ్ ఉంటున్నాది. ఐస్ క్యూబ్ ప్రత్యక్ష ప్రమాణము. కాని, పరోక్షమైన జలము దీనికి ఆధారంగా ఉంది. పరోక్షమైన జలములేక ప్రత్యక్షమైన ఐస్ లేదు. కనుక, ప్రత్యక్ష ప్రమాణమైన ఐస్ క్యూబ్‌కి పరోక్షమైన జలము ఆధారము. కాబట్టి ప్రత్యక్షమునకు ఏది ప్రధానము? పరోక్షమే ప్రధానము, ఆధారము. కనుక, దృశ్యకల్పితమైన జగత్తునకంతా పరోక్షమైన దివ్యత్వము ఆధారము. ఈ సత్యమును గుర్తించుకొనలేక మానవుడు వేదమే వేదాంతముగా భావించుకొని వేదమే అద్వైతముగా విశ్వసించి వేదమునే ఉచ్చరించుచూ వేదములోనుండిన విషయములను అనుభవించుటకు ప్రయత్నిస్తుంటాడు. మానవుడు ప్రాకృతమైన జీవితములో కాలము గడుపుతున్నాడు. భౌతికమైన జీవితములో కాలము

sri sathyasai vachanamrutam

గడుపుతున్నాడు. అనిత్యమైన ప్రకృతియందు కాలము గడుపుతున్నాడు.

**అన్నింటికిని ఆధారము అద్వైతమే!**

ప్రకృతి, ప్రవృత్తితోకూడినది. దీనికి విరుద్ధమైన నివృత్తి వేరే ఉంటున్నాది. ఈ నివృత్తికి ఆధారమైనదే పరతత్త్వము. ఇట్టి పరతత్త్వము బోధించే నిమిత్తమై, మూలాధారమైన తత్త్వము వివరించే నిమిత్తమై శంకరులవారు ఎంతో శ్రమించారు. ఆ కృషితో ఆయన గురువు గౌడపాదుడు ఆయనకు ఉత్సాహప్రోత్సాహములందిస్తూ వచ్చాడు. వయస్సు చిన్నదైనా, దృఢసంకల్పముతో నిల్చాడు శంకరులవారు. 16 సం॥ల వయస్సునందే యింతమంది పండితులతో వాదోపవాదములు సల్పి అందరిని అద్వైతమతమునందు ప్రవేశపెట్టి తాను ఆనందించుటకు మూలకారణము ఆయన వెనుకనుండిన దివ్యశక్తియే! అన్నింటికిని ఆధారము అద్వైతమే! ఈ అద్వైతము అనగా ఏమిటి? అన్నింటి ఏకత్వమే అద్వైతము. చాలామంది పిల్లలు చూచి ఉంటారు. చక్కెరతో కొన్ని బొమ్మలు చేసి పెడతారు. నక్క, కుక్క, ఏనుగు అన్నీ చేసి పెడతారు. కానీ పిల్లలు రూపమును మాత్రమే చూస్తారు. 'నాకు నక్క కావాలి, నాకు కుక్క కావాలి' అంటారు. నక్క, కుక్క, ఇలా రూపనామములు వేరుగా ఉన్నాయిగానీ అన్నింటియందు చక్కెర ఒక్కటే! ఆ నక్కబొమ్మలోని చెవి కొద్దిగా త్రుంచి తీసుకు నోట్లో వేసుకో! తియ్యగా ఉంటుంది. ఆ నక్కతోక కొంచెం నోట్లో వేసుకో! తియ్యగా ఉంటుంది. దాని మొత్తం స్వరూపమంతా మాధుర్యమే! అదే విధముగా జగత్తంతా బ్రహ్మ. 'ఈశావాస్య మిదం సర్వం'. 'ఈశ్వర స్సర్వభూతానాం'. ఈ విధంగా దైవత్వము సర్వత్రా ఉంటున్నాదనే సత్యమును తాను గుర్తించి ప్రబోధిస్తూ వచ్చాడు, శంకరుడు. భక్తులు తమతమ భేదభావముచేత భగవంతునికి ఒక ప్రత్యేకరూపము ఆపాదిస్తూ తమ ఆరాధన ఆ ఒక్క స్వరూపమునకే పరిమితం చేస్తూ మిగతా స్వరూపములకు ఏమాత్రము స్థానము యివ్వకపోవటమే ఈ దోషమునకు మూలకారణము.

**భిన్నభిన్న రూపములలోనున్న మానవత్వమునకే విలువ**

ఒక శ్రీమంతుడు ద్వైతభావముకూడిన భక్తితో (అతనికి కృష్ణ అంటే చాలా ప్రేమ) కృష్ణ విగ్రహము చేయించుకొని నిత్యము దానిని పూజించాలి, అభిషేకము చేయాలి, ఆ



sri sathyasai vachanamrutam

అభిషేకతీర్థము తాను దినము గ్రోలాలి, అనే సంకల్పము చేసుకున్నాడు. అయితే, కాలము చాలా మార్పులతోకూడినది. కష్టసుఖములు కావడికుండలు. ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించగలరు? శ్రీమంతుడుగా ఉన్నప్పుడు అతడు 20 కాసుల బంగారము యిచ్చి కంసాలితో కృష్ణ విగ్రహము చేయించుకున్నాడు. తరువాత 20 కాసులతో కృష్ణునికి ఒక గోవును చేయించాడు. యింక 20 కాసులు యిచ్చి నెమలిని చేయించి కృష్ణుని దగ్గర పెట్టాడు. అభిషేకము చేయుటకు 20 కాసులు బంగారపు కప్పు చేయించుకున్నాడు. నిత్యము ఆ కప్పుతో కృష్ణునికి అభిషేకము చేయటము, తీర్థము గ్రోలటము, ఆనందించటము ఈ విధంగా జరుగుతూ వచ్చింది. కానీ కాలము ఏనాటికి ఒక్కలా ఉండదు. ఎప్పుడు హెచ్చుపల్లములు వస్తాయో చెప్పటానికి వీలుకాదు. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' అన్నట్లు తన పుణ్య ప్రాప్తి అంతా క్షీణించింది. ఈ శ్రీమంతుని పరిస్థితి దిగజారిపోతూ వచ్చింది. కడపటికి దినము జరగటమే కష్టమైపోయింది. ఇంక భరించుకొనలేక ఈ విగ్రహమును యింకొక శ్రీమంతుని దగ్గరకు తీసుకువెళ్లాడు. అతనికి అమ్మి డబ్బు తీసుకోవాలని ప్రయత్నించాడు. మొట్టమొదట అభిషేకము చేసే గిన్ని తూకంవేశాడు. ఇది 20 కాసులు. 60,000 రూపాయలు. తరువాత నెమలిని తూకం వేశాడు. ఇది 60,000 రూపాయలు. గోవును తూకం వేశాడు. యిది 60,000 రూపాయలు. తరువాత కృష్ణుని తూకం వేశాడు యిది 60,000 రూపాయలన్నాడు. 'ఏమిటి గోవు, నెమలి, కప్పు, కృష్ణుడు అందరు ఒకే వెలనా, నేను భరించలేను. కృష్ణునికి ఎక్కువ వెల యివ్వాల'న్నాడు. ఆయన చెప్పాడు 'నీకు కృష్ణరూపము, నెమలిరూపము, కప్పురూపము వేరువేరుగా ఉంటున్నాయి. కాని నాకు అందులో గల బంగారము ప్రధానము, దానికి విలువ యిస్తా'నన్నాడు. బంగారు తూకమునకు విలువ యిచ్చాడుగానీ రూపమునకు విలువ యివ్వలేదు. అదే విధముగా భిన్నభిన్నరూపములలో నున్న మానవత్వమునకే విలువ. అందరియందున్న పంచభూతముల పరతత్వమునకే అద్వైతము అన్నారు. ప్రతి మానవునియందు ఈ పంచభూతములు తప్ప మరొక భూతము అధికముగా లేదు. ఆరవభూతమేలేదు. కానీ మనము మరొకటి ఉన్నదని భ్రమించి దానికొరకు అనేక విధమైన ప్రయత్నములు సలుపుతున్నాము.

## దురాశ దుఃఖమునకు కారణము

ఈ దురాశే దుఃఖమునకు కారణము. ఆశలుండాలి. కాని, ఆశకుకూడా ఒక పరిమితముండాలి. మీరందరు చదివి ఉంటారు. King Midas చరిత్ర. ఇతను శ్రీమంతుడు. భక్తుడు. యితనికి చాలా దురాశ. తన ఆరాధ్య దేవతను అమితంగా ప్రార్థిస్తూవచ్చాడు. తెల్లవారి మొదలు రాత్రి పరుండునంతవరకు ఆరాధన సల్పుతూ వచ్చాడు. దేవత ప్రత్యక్షమైంది. ప్రార్థనలకు ప్రత్యక్షమవటము దేవతల లక్షణము. భక్తులు ప్రార్థన చేయటము వారి కర్తవ్యము. ఈ విధంగా జరుగుతూ వచ్చింది. ఒకనాడు మైదాస్ ప్రార్థించాడు, 'తల్లీ! నేను ముట్టినదంతా బంగారు కావాలి. ఆ వరము ప్రసాదించమ'న్నాడు. 'సరే యిచ్చాను; వెళ్లు', అంది. కానీ మొట్టమొదట దేవత చెప్పింది; 'నీవు కోరరాని కోరిక కోరుతున్నావు. చాలా దురాశతో కూడినది. దానివల్ల నీకు సుఖముండదు. చాలా కష్టములకు గురి అవుతావు. బాధలకు గురి అవుతావు. జీవితము వ్యర్థమై పోతుంది. కనుక ఈ వరము నీవు కోరవద్దు'. 'నా అవస్థ నాకుండనీ. నీవు తప్పక యివ్వవలసిందే' అని పట్టు పట్టాడు మైదాస్. సరే చెప్పిన మాట వినకపోతే ఏమి చేస్తుంది? 'నీ అవస్థలు నీవు అనుభవించు' అన్నాది. వరము పొంది ఇంటికి వచ్చాడు. పరుపుపై కూర్చున్నాడు. దిండు తీసి పక్కన పెట్టాడు. పరుపు, దిండు బంగారై పోయింది! 'ఒహో యివి మాత్రమే బంగారు అయ్యాయి. మిగిలినవి అవుతాయో అవవో' అని కాంపౌండులోనికి వెళ్లి ఉద్యానవనములో ప్రవేశించాడు. ప్రతి వృక్షమును ముట్టాడు. ప్రతి పూలమొక్కను ముట్టాడు. ప్రతి పుష్పమును ముట్టాడు. అన్నీ బంగారైపోతూ వచ్చాయి. కడపటికి అలసిపోయాడు. బిడ్డను పిల్చాడు అమ్మా! టీయో, కాఫీనో తీసుకురమ్మన్నాడు. తీసుకువచ్చింది. దాన్ని ముట్టాడు బంగారు అయిపోయింది. ఆకలి పెరిగిపోతున్నాది. కానీ ఏది ముట్టినా బంగారై పోతున్నాది. బిడ్డను ముట్టాడు బిడ్డకూడా బంగారైపోయింది. విగ్రహంగా తయారైపోయింది. అప్పుడు బుద్ధి వచ్చింది మైదాస్‌కు. 'ఛీ! దేవి చెప్పినా నేను మూర్ఖుడనై వినలేదు. విధి అంటే యిదే!' అనుకుని తిరిగి దేవి దగ్గరకు వెళ్లి తీవ్రమైన ఆవేదనచేత ఆమెను ప్రార్థించాడు. ఆమె ప్రత్యక్షమైంది 'నాయనా! నా మాట వినలేదు నీవు. నీకు యీ గతి పట్టింది. ఇప్పుడు ఏమి కావాల'ంది. 'నీవు యిచ్చిన వరము వెనుకకు తీసుకోమ'న్నాడు. అప్పటినుండి తాను తెలివితేటలతో బ్రతుకుతూ వచ్చాడు. మానవత్వములోనున్న ఆశలు యింత ప్రమాదమునకు గురి చేస్తుంటాయి.



srisathyasaivachanamrutam

**దైవాజ్ఞను శిరసావహించి నడుచుకున్నప్పుడు ఎంతైనా సుఖము లభిస్తుంది**

దైవ ఆజ్ఞను శిరసావహించి ప్రవర్తించినప్పుడు వారికి ఎంతైనా సుఖము, శుభము జరుగుతుంటాయి. శంకరులవారు లోకములో దీనికి అర్థము చెబుతూ వచ్చారు.

**వలదు వలదు ధనదాహము నరుడా**
**మంచిబుద్ధితో మారుము కోర్కెలు**
**కర్మఫలితమే కదరా విత్తము**
**కలిగినంతలో కనరా తృప్తిని**
**హరిగోవిందా హరిగోవిందా హరిగోవిందా అనరా మందా**

ఓ మానవుడా! దురాశకు నీవు గురికావద్దు. ఆశలు పెట్టుకో. కానీ, భగవంతుని పొందేంతవరకు ప్రేమకావాలి. ఆ ప్రేమయే నీకు సర్వస్వము యిస్తుంది. ఎప్పుడు ఎక్కడ ఏది కావాలో తానే అనుగ్రహిస్తుంది.

**అడుగకువె ఓ మనసా**
**అడుగు కొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥**
**అడుగని శబరిని ఆదరించడే**
**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకునేగి సద్గతి కల్గించడే ॥అడు॥**

దశరథమహారాజు రాముని ఎంతయో ప్రార్థించాడు, 'నాయనా! నా అంత్య సమయములో నీ హస్తముతో నా నోటిలో నీరు పోయ'మని. కాని ఆ ప్రాప్తి అతనికి ఏమాత్రముకూడను దక్కలేదు. అడగని జటాయువుకు మోక్షము నందించాడు. ఆ జటాయువు అడగకున్నా తన హస్తముతో దాని నోటిలో నీరు పోసి దాని జన్మ సార్థకము గావించాడు. 'అడుగని శబరిని ఆదరించడే! శబరి రాముని ఏదీ కోరలేదు. కానీ నిరంతరము రామ చింతన చేస్తూ వచ్చింది. 'రాముడు అరణ్యములో ప్రవేశించాడట! ఏ మార్గములో వస్తాడో ఏమో' అని తలచుకొని ఆ మార్గమునంతా ఊడ్చి శుభ్రము చేస్తూ వచ్చింది. ఒక రేగుపండ్ల చెట్టుక్రింద కూర్చుంది.

sri sathyasai vachanamrutam

'అయ్యో! సీతా సమేతుడై రామచంద్రుడు అరణ్యమునకు వచ్చాడట! ఈ మార్గములో వచ్చి అమ్మా ఏమైనా పండ్లు యిస్తావా అని అడుగుతాడో ఏమో' అని ఆమె భ్రమ పడింది. ఆ విధమైన భావముతో ఒక్కొక్క పండు రుచి చూడటం తీయగానున్నదానిని దాని పెట్టుకోటం, లేనిదానిని పారవేయటం చేస్తూ వచ్చింది. 'యద్భావం తద్భవతి'. వారివారి పవిత్రమైన భావములకొలది దివ్యత్వమైన దైవత్వము అట్లు అనుగ్రహము నందిస్తూ వస్తుంది. కానీ సాధకునియొక్క బుద్ధులు అనేక విధములైన మార్గములో ప్రవేశించుటచేత దానిని పురస్కరించుకొని భగవంతుని అనుగ్రహము పోవలసి వస్తుంది. ఒక నిలువుటద్దముముందు నీవు చేరావు. అందులో చూచినప్పుడు నీ ప్రతిబింబము నీకు కనిపించింది. ప్రతిబింబమునకు నీవు నమస్కారము చేస్తే ఆ ప్రతిబింబముకూడా నీకు నమస్కారము చేస్తుంది. ఆ ప్రతిబింబమును నీవు దండిస్తావా ఆ ప్రతిబింబముకూడా నిన్ను దండిస్తుంది

**కర్మ దాట వశమా నరుడా కర్మ దాట వశమా**
**ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥**

**కార్యకారణ సంబంధమే జగత్తు**

ఎట్టి కర్మలు చేస్తావో అట్టి ఫలితమే నీకు వస్తుంది. ఇక్కడ నిలువుటద్దము ఏమిటి? ప్రకృతి. బింబమే దైవత్వము. విష్ణువే కారకుడు. ప్రకృతియే కార్యము. కార్యకారణ సంబంధమే జగత్తు. కనుక నీవు ప్రకృతి అనే అద్దములో ఏమి చేస్తే ఆ ప్రతిబింబము నీ reaction, reflection, resound రూపములో అంతా నీకు వస్తున్నాది. ఉన్నదంతా ఒక్కటే! ఇదే ఏకత్వము. బింబము, ప్రతిబింబము ఈ రెండు అద్దముద్వారా కలిగినవే! అద్దములేక రెండూలేవు. అదే ప్రకృతి, పరమాత్మలకు మధ్యగల వ్యత్యాసము.

**చిత్రంబులు త్రైలోక్యప**



sri sathyasai vahini / sri sathyasaivachanamrutam

**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు ముని జన వన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

ప్రాకృతరీతిలోపల యిక్కడ ఎన్ని ఉన్నాయి? నీవు, ప్రతిబింబము, అద్దము, మూడు ఉన్నాయి. మూడింటిలో ఒకటి పోతే ఎంత అని ఒక మొదటి తరగతి విద్యార్థిని అడిగినా రెండు అని చెబుతాడు. లోకసంబంధమైన లెక్కల విషయము అందరికి తెలిసినదే, 3-1=2. కానీ, దైవము దీనికి అంగీకరించదు. తప్పు అంటాడు. 3-1=1 అంటాడు. ఏమిటది? 'భగవంతుడు ఏ స్కూల్లో చదవలేదు ఏమిటో యితనికి లెక్కలు తెలియదే', అని అనేకమంది భగవంతునికూడా హేళన చేస్తారు. ఇక్కడ నీవు, నీ ప్రతిబింబము, అద్దము, మూడున్నాయి. పిచ్చివాడా! అద్దమును తీసివేయి. అప్పుడు ప్రతిబింబముకూడా పోయింది. ఉన్నది ఒక్కటే! బింబము. కనుక, లోకసంబంధమైన విషయములలో ప్రాకృతికంగా, ఆధ్యాత్మికంగా వ్యత్యాసములు అనేకంగా కనిపిస్తుంటాయి. Many people think, many people say money makes many things, but I say money makes many wrongs. Money makes many things అంటారు, ప్రపంచములో. కాదు, కాదు. Money makes many wrongs. ఈ విధమైన సత్యమును గుర్తించుకున్నప్పుడే Moneyని సద్వినియోగము చేయటానికి వీలవుతుంది. ఇది శంకరులవారి ఏకత్వములోనున్న ప్రత్యేకత. నిత్యజీవితములో జరిగేవికూడ ఏకత్వములో తాను ప్రబోధిస్తూ వచ్చాడు. అది నిన్న చెప్పాను కదా!

**సంస్కారము పరిపక్వమైనప్పుడు అంతా ఒకటనే భావము వస్తుంది**

**మృత్పిండమేకం బహుభాండరూపం**
**సువర్ణమేకం బహుభూషణాని**

మట్టి ఒక్కటే, కాని కుండల రూపనామములు వేరువేరు. బంగారం ఒక్కటే! ఆభరణములు వేరువేరు. అదే విధముగా దైవత్వము ఒక్కటే, 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. అల్లా అని చెప్పండి, జీసస్ అని చెప్పండి, బుద్ధ అని చెప్పండి, జోరాష్ట్రియన్ అని చెప్పండి, రామా అని చెప్పండి, హరి అని చెప్పండి అంతా చేరి ఒక్కటే! ఇది ఎట్లా? నిత్యజీవితములో ఒక

sri sathyasai vacharamrutam

ఉదాహరణ. ఒక యింటి యజమాని ఉంటాడు. భార్య వస్తుంది my dear husband అంటుంది. ఆమె సంబంధము ఆ రకముగా ఉంటున్నాది. మనుమడు వస్తాడు. My dear grand father అంటాడు. యిద్దరూ మాట్లాడుతుండగానే brother వస్తాడు. My dear brother అంటాడు. కుమారుడు వస్తాడు. My dear father అంటాడు. కోడలు వచ్చి My dear father-in-law అంటుంది. ఇన్ని సంబంధాలు, పేర్లు ఉన్నా, యజమాని ఒక్కడే! యింతమంది యిన్ని రకములైన సంబంధములు పెట్టుకోవటంచేత యిన్ని రకములైన పేర్లు ప్రారంభమవుతున్నాయి. ఇదంతా బంధుత్వము.

**త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ.**

అంతా నీవే! అంటారు. ఎంత పిచ్చితనము! చూడండి. 'ఓ భగవంతుడా నీవే నా తండ్రి, నీవే నా తల్లి, నీవే నా మిత్రుడు, నీవే నా బంధువు, నీవే నా సర్వస్వము' అంటారు, భగవంతుని. దీనిని శంకరులవారు ఖండిస్తూ వచ్చారు. ఇది చాలా పొరపాటు. నీవు నా తండ్రివి అన్నప్పుడు తండ్రి తండ్రిగానే ఉంటాడు, కుమారుడు కుమారుడుగానే ఉంటాడు. ఏమి ప్రయోజనం? కాదు కాదు, రెండింటిని ఏకత్వము చేయాలి. You are I, I am you. You and I are one only. యిదే అద్వైతములోనున్న పటుత్వము. దీనిని పురస్కరించుకొనియే వేదము 'తత్త్వం అసి' అన్నది. ఈ విధమైన ఏకత్వముచేత మనకు ఎంతైనా ఆనందము కలుగుతుంది, అని శంకరులవారు అద్వైతము ప్రబోధిస్తూ వచ్చారు. అయితే అది అంత సులభముకాదు. దానికి అనేక రకములైన విచారణ జరగాలి. దానికి తగిన సంస్కారము ఉండాలి. ఈ సంస్కారము పరిపక్వము కావాలి. సంస్కారము పరిపక్వమైనప్పుడు అంతా ఒకటనే భావము సులభముగా మనకు వస్తుంది. అటువంటి భావము కలిగినవాడు ఎంత అదృష్టవంతుడో! అతనికంటె అదృష్టవంతుడు మరొకడు జగత్తులో ఉండడు. అట్టి భావము కలిగినవాడు మహా పుణ్యాత్ముడు. వాడే జగత్తుకు రాజు. రాజులకు రాజు, మహారాజరాజు. ఆత్మ సామ్రాజ్యమునకు యితడు రాజు.

**ఆత్మ సర్వులయందు ఉంటున్నాది**

srisathyasaivachanamrutam

ఆత్మ సర్వులయందు నఖశిఖపర్యంతము ఉంటున్నాది. ఇట్టి అమృతత్వము గుర్తించలేనివారే విషమును ఆశిస్తుంటారు. అమృతము యిక్కడ ఉన్నదనే సత్యాన్ని గుర్తించుకుంటే చాలు మరొక విషయమునకు ప్రయత్నము చేయడు. అమృతము అనేది తెలియనివాడే విషముకోసం ప్రయత్నం చేస్తూ ఉంటాడు. కనుక మొట్టమొదట ఈ అమృతానుభవము కొంతవరకు కలిగించుకొనుటకు ప్రయత్నించాలి. కనుక, శంకరులవారు అద్వైతసిద్ధాంతమును పల్లెమొదలుకొని పట్టణమువరకు, విద్యాహీనునిమొదలు విద్యావంతునివరకు ఈ ఏకత్వమనే భావము తెప్పించాలని అనేక ప్రయత్నములు చేశాడు. ఈ విధంగా కాశీ క్షేత్రములో సభలు జరుగుతుండగా, శంకరులవారు ఒక ఆదర్శమును నిరూపిస్తూ వచ్చారు. ఇల్లు వదిలే సమయంలో తల్లికి వాగ్దానమిచ్చాడు. 'నాయనా! నీవు యిల్లు వదలిపోతున్నావు. సన్యాసము నాకు యిష్టము లేకపోయినా స్వీకరించావు. కానీ అంత్యసమయములో నిన్ను చూడాలనే ఆశ నాకు ఉన్నది. కనుక నా అంత్యసమయములో నా దగ్గర ఉండాలని' ఆశించింది. మహా హృదయము కలిగినవాడు కనుక, చిత్తశుద్ధి కలిగినవాడు కనుక, తన వాగ్దానము తప్పక చెల్లించుకోవాలని సంకల్పించుకున్నాడు.

## చిత్తశుద్ధి కలిగినవారు ఏది చెప్పినా సత్యమే అవుతుంది

చిత్తశుద్ధి కలిగినవారు చెప్పిన మాట సత్యమే అవుతుంది. ఏది చెప్పినా సత్యమే అవుతుంది. యిది పుష్పము కాదంటే పుష్పము కాకుండానే పోతుంది. ఆ సత్యమును గుర్తించాలి. అమావాస్య దినమున ప్రారంభమవుతుంది, మహాభారత యుద్ధము. చతుర్దశినాడు అర్జునుని యుద్ధభూమిలోనికి కృష్ణుడు తీసుకువెళ్లాడు. రేపటిదినము యుద్ధము ఏవిధంగా సాగించాలి, ఎవరెవరు ఏఏ స్థానములో ఉంటుండాలి, ఎవరెవరు ఏ శంఖము ఊదాలి అనే విషయాలు మాట్లాడుకుంటూపోయారు. భగవంతుడు ఎప్పుడూ అనుగ్రహము అందించే ముందుగా వ్యక్తియొక్క శక్తిసామర్థ్యములు పరీక్షిస్తాడు. అప్పుడే భగవంతుడు యిచ్చినదానిని దక్కించుకోటానికి భక్తుడు అర్హుడౌతాడు. 'అర్జునా! చీకటైంది వెళ్లి రమ్మ'న్నాడు. ఊ! యింటికి వెడదామ'న్న కృష్ణుడు అక్కడ ఒక పరీక్ష ప్రారంభించాడు:

sri sathyasai vahini vacanamrutam

'అర్జునా! ఆ చెట్టుపైన ఉన్నది నెమలేకదా', అన్నాడు. 'అవును స్వామీ! నెమలియే!' అన్నాడు అర్జునుడు. 'పిచ్చివాడా! నెమలికాదు, గురుత్మంతుడు' అన్నాడు కృష్ణుడు. 'అవును, గరుత్మంతుడే!' అన్నాడు అర్జునుడు. అప్పుడు కృష్ణుడు 'ఏమిటి, నేను ఏది చెబితే దాన్ని ఒప్పుకుంటున్నావు. సత్యమా కాదా అనే విచారణ అక్కరలేదా నీకు? విచక్షణాజ్ఞానశూన్యుడైనావు నీవు. ఎలా యుద్ధము చేయగలవు?' అని నిలదీశాడు. అర్జునుడు 'కృష్ణా! నెమలి కాదంటే నీవు నెమలిగా మార్చవచ్చు. గరుడుడు కాదంటె నీవు గరుడుడుగా మార్చవచ్చు. కాబట్టి, అది నెమలా లేకా గరుడుడా అనే విచారణ నాకు అక్కరలేదు. నీ వాక్కు నాకు కావాలి. నీ వాక్యమే నాకు సత్యము' అన్నాడు. అప్పుడే చెప్పాడు కృష్ణుడు:

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోసి మే.**

'యిప్పుడు నీవు నా భక్తుడవు. నా మాటపై విశ్వాసము అధికంగా ఉంటున్నాది. కనుక, అన్నింటిని జయించగలవ'ని అప్పుడు గీతను బోధించటం ప్రారంభించాడు.

**కాలకర్మకారణకర్తవ్యములు కలిసివచ్చినప్పుడే దైవానుగ్రహము లభిస్తుంది**

విశ్వాసము లేనివానికి ఎంత బోధించి ప్రయోజనం ఏమిటి? ఈ యుద్ధ సమయంలో అర్జునునికి 84, కృష్ణునికి 86 సం॥లు వయస్సు. అంతవరకు ఏనాడు గీతను బోధించలేదు. కాలకర్మకారణకర్తవ్యములు కలిసి వచ్చినప్పుడే దైవానుగ్రహము కలసివస్తుంది. 84 సం॥లలో కృష్ణుడు ఎప్పుడూ అర్జునునితో వేదాంతమే మాట్లాడలేదు. అప్పటికప్పుడు ఉట్టిపడినట్లు వేదాంతము ప్రారంభించాడు. 'అర్జునా! వీరందరు ఎవరు? వీరంతా బంధువులు అనుకుంటున్నావు. కాదు, కాదు. నీ బంధువులు కారు. నీవు, వారు ప్రత్యేకంగా లేరు. నీవు నేను, వారు అందరు ఒక్కటే!' అన్నాడు. అక్కడ మరింత పిచ్చి పట్టిపోయింది అర్జునునికి. 'అంతా ఒకటి ఎట్లా అవుతుంది? అంతా ఒకటైతే యుద్ధము అనవసరం కదా', అన్నాడు. 'పిచ్చివాడా! ఒక విషయము ఉంటున్నాది. నాకు తెలుసు, నీకు తెలియదు. నీవు మరుపులో ఉన్నావు, నేను ఎరుకలో ఉన్నాను. అదే తారకమంత్రము

sri sathyasai vahini amrutam

**ఎరుక మరుపనకుండ నిరతము జాగ్రత్స్వప్నసుషుప్తిలో**
**అరమరలు లేకుండ ఎప్పుడు తరచుగ జీవాత్మ**
**జడివెడి తారకము సూటెరుగవలెనన్నా**
**సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుమన్నా!**

తెలుసుకున్నవాడను నేను, తెలియనివాడవు నీవు. నీకు, వానికి ప్రస్తుతం దేహసంబంధమునే చెబుతున్నావు. గతం నీకు తెలియదు. తెలుసు; కానీ మర్చిపోయావు. స్వామీ! నీవు ఉన్నావు, వారు ఉన్నారు, నేను ఉన్నాను అంటున్నావు. నీవు ప్రాకృతమైన దృష్టితో చూస్తున్నావు. కనుక, మరుపు వచ్చింది. నేను నివృత్తి దృష్టితో చూస్తున్నాను'.

**భగవంతునికి ఎల్లప్పుడు ఎరుకయే!**

త్రికాలభాద్యమైనవాడు భగవంతుడు. 'నాకు ఎప్పుడు ఎరుకగానే ఉంటుంది. నీవు మర్చిపోయినావు' అన్నాడు. చక్కని ఉదాహరణ. పేర్లు వేరు, వేరు. మీకు అర్థమయ్యేకోసం చెబుతున్నాను. ఒకానొక సమయంలో నీవు కాశ్మీరు యాత్ర పోయావు. అక్కడ చాలా చవకగా చిక్కిందని ఒక సూటుగుడ్డ కొన్నావు. మంచి విలువైన గుడ్డ కొన్నావు. తీసుకువచ్చి అమ్మకు యిచ్చావు. బీరువాలో పడవేసింది. అది మర్చిపోయావు. పది సంవత్సరములు జరిగిపోయింది. తరువాత ఏదో చూస్తుంటే ఈ గుడ్డ కనుపించింది. అది తల్లి చూచి 'రామా! నీవు తెచ్చుకున్న గుడ్డ యిది. కుట్టించుకో'మని యిచ్చింది. కుట్టించుకున్నావు. సాయంకాలమే యిచ్చాడు టైలరు. రెండవరోజు పుట్టినరోజున ధరించావు. అమ్మ తెచ్చిన స్వీట్లు తమ్మునికి అందించాలని వంగినావు. వంగేటప్పటికి గుడ్డ చిరిగిపోయింది. అమ్మ అడిగింది: 'నాయనా! కొత్తవస్త్రమే! అప్పుడే చినిగి పోయిందా?' కుమారుడు ఈ విధంగా ప్రబోధిస్తూవచ్చాడు: 'అమ్మా! సూటు కొత్తదే; కాని, బట్ట పాతది. సత్యమాకాదా? నీవు మర్చిపోయావు. నేను ఎరుకలో ఉంటున్నాను'. నీకు, నాకు ఉండిన వ్యత్యాసము యిదే! నాకు ఎరుక, మీకు మరుపు. యింతేకాక యుద్ధభూమిలో చిన్న చిన్నవారు అందరు పోయారు. అప్పుడు అర్జునునికి చాలా బాధ కలిగింది. 'అభిమన్యుడు చిన్నవాడుకదా! అతను పోవటానికి కారణం ఏమిటి? నేను పెద్దవాడను కదా, నేను పోకూడదా! అన్నాడు.

sri sathyasai vahanamrutam

'పిచ్చివాడా! నీవు నేను అని చెప్పటానికి వీలులేదు. ఎవరి టైము ఎప్పటికి కలుగుతుందో అప్పుడు పోక తప్పదు', అన్నాడు కృష్ణుడు.

**భగవంతుడు గతము, వర్తమానము రెండూ చూస్తాడు**

**పోకన్మానదు దేహమేవ్విధమునన్ పోషించి రక్షించినన్**
**రాకన్మానవు హానివృద్ధులు మహారణ్యమునన్ దాగినన్**

యివన్నీ జన్మాంతరసంబంధములు. ఒక చిన్న ఉదాహరణ. ఒక రాయి ఉంటున్నాది. దానిని ఒక 25 సంగాల యువకుడు సుత్తి తీసుకొని 20 వేట్లు కొట్టాడు. కానీ, రాయి పగలలేదు. తరువాత ఒక వృద్ధుడు రెండు వేట్లు కొట్టగానే రెండు ముక్కలైంది. అప్పుడు వృద్ధుడు గర్వంచేత అంటున్నాడు, 'యువకుడు 20 వేట్లు కొట్టినా అది పగలలేదు, నేను రెండు వేట్లతో పగలకొట్టాను చూడు'. అప్పుడు ఒకాయన చెప్పాడు: 'వృద్ధుడా! యింత మాత్రమునకే నీవు గర్వము అభివృద్ధి పరచుకోకు- రెండు వేట్లకు కాదు, పగిలి ఉండేది. నీకు ముందు 20 వేట్లు కొట్టాడు, ఒక యువకుడు. అది ఇదీ కలిపి 22 వేట్లకు రాయి పగిలింది' అని. మనము అప్పటికప్పుడు జరిగింది చూచుకుంటాము. భగవంతుడు గతంకూడా చూస్తుంటాడు. యిదియే భగవంతునికి, మనకు మధ్య ఉన్న వ్యత్యాసము. దైవత్వము సర్వత్ర ఉంటున్నాది. కానీ, ప్రస్తుతమునే నీవు చూస్తున్నావు. గతం, వర్తమానం రెండూ భగవంతుడు చూస్తాడు. గతంలో వృక్షంగా ఉంది. భవిష్యత్తులో వృక్షంగా ఉంటుంది. వర్తమానంలో విత్తనముగా ఉంది. విత్తనమును మాత్రమే చూస్తున్నావుగానీ ఆ రెండు వృక్షములు విత్తనమునుండి వచ్చినవే! కనుక 'బీజంమాం సర్వభూతానాం' అన్నాడు కృష్ణుడు. ఈవిధమైన అద్వైతమును క్రమక్రమేణా లోకానికి చాటుకుంటూ వచ్చాడు. ఈ అద్వైతమునకు మూలాధారము ఒకటి కావాలి. ఈ మూలాధారతత్త్వము మానవునికి అర్థము కావాలంటే ఎన్నో ఉపమానములను క్రోడీకరించాలి. ముమ్ముందు మీరుకూడా ఆ మూలాధారతత్త్వమును గుర్తించటానికి సిద్ధంగా ఉండండి!

**(తేదీ 08-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam